క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 10న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూ పోలీస్ స్టేషన్, పలివేల్పుల, సీఆర్‌పీఎఫ్ క్యాంప్, టీబీ హాస్పిటల్, మహాత్మానగర్, విజయ గణపతి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ప్రకాశ్‌రెడ్డిపేట, మైత్రివనం కాలనీ, లోటస్ కాలనీ, విల్లాస్, దర్గా, సిద్ధార్థనగర్, టీచర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, ప్రశాంత్ నగర్, రెవెన్యూ కాలనీ, ప్రగతినగర్, నాగేంద్రనగర్, చైతన్యపురి కాలనీ, టెంపుల్ ట్రీ విల్లాస్, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్, మల్లికాంబ మనోవికాస కేంద్రం, రాజ్‌పుత్‌వాడా, పద్మాక్షి కాలనీ, ఎస్ఆర్ కాలేజీ, జయ నర్సింగ్ కాలేజీ, కుమార్‌పల్లి, పోచమ్మకుంట, బొక్కలగడ్డ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. బీరన్నకుంట, ఎస్ఆర్ఆర్ తోట, పెరుకవాడ, శాంతినగర్, మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ఏఎస్ఎం కాలేజీ, రంగశాయిపేట సెంటర్, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, మై మాస్టర్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, కంటి ఆస్పత్రి, ఇస్లామియా కళాశాల తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, కాశిబుగ్గ, వివేకనంద, సాయి గణేశ్ కాలనీ, సొసైటీ కాలనీ, సాయిబాబా దేవాలయం, ఎరుకలవాడ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

బాధ్యతల స్వీకరణ



మడికొండ: మడికొండ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా గుగులోతు రామ్మోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

నేలకూలిన భారీ వృక్షం



హన్మకొండ అర్బన్: నగరంలోని ఏషియల్ మాల్ సమీపంలోని కళ్యాణి ఆస్పత్రి ఎదురుగా ఉన్న భారీ వృక్షం బుధవారం ఉదయం ఒక్కసారిగా రోడ్డుపై నేలకూలింది. దాంతో సమీపంలోని షాపుల నిర్వాహకులు, వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో చెట్టు కింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. సమాచారం అందుకున్న హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని చెట్టును తొలగించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బోడగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ నాయకుడు మైసారపు సిరిల్ లారెన్స్ బుధవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి 5వ వర్ధంతి సందర్భంగా నోట్‌బుక్స్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అజ్జర్, ఇమ్మడి రవి, దొంగల కుమార్, సిలువేరు మల్లికార్జున్, సిరిపాక కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల అప్పగింత



వరంగల్ చౌరస్తా: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఐదుగురికి బుధవారం తిరిగి అందజేసినట్లు సీఐ షుకూర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, రోహిత్ పాల్గొన్నారు.

శివకుమార్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కక్కెర శివకుమార్ హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 'ఫండస్ ఇమేజ్ సెగ్మెంటేషన్ అండ్ క్లాసిఫికేషన్ ఫర్ డయాగ్నోసిస్ ఆఫ్ డయాబెటిక్ రెటినోపతి యూజింగ్ డీప్ న్యూరల్ నెట్ వర్క్స్' అనే అంశంపై శివకుమార్ పరిశోధనలు చేశారు. హైదరాబాద్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంధ్య పర్యవేక్షణలో పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని ఆయన సమర్పించారు.

'పరఖ్'లో టాప్

- రాష్ట్రంలో హనుమకొండ జిల్లాకు మొదటిస్థానం
- విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుదల
- భాషలు, గణితం అంశాల్లో ఉదిత్‌స్థాయి
- గణితం – సైన్సెస్‌లో ఒకశాతం తేడా, సోషల్‌లో రెండు శాతం తేడా..

విద్యారణ్యపురి: పర్‌ఫార్మెన్స్ ఎసెస్‌మెంట్ రివ్యూ అండ్ అనాలిసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (పరఖ్ – న్యాస్) సర్వేలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుదలలో రాష్ట్రంలో హనుమకొండ జిల్లా టాప్‌గా నిలిచింది. భారతదేశంలోని పాఠశాలల విద్యార్థులు ఎంత బాగా నేర్చుకుంటున్నారో అంచనా వేయడం పరఖ్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) లక్ష్యం. దేశంలోని విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యా స్థాయిని అంచనా వేసేందుకు పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్–2024 (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2024) పేరిట జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన పాఠశాలల్లో డిసెంబర్– 2024లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సర్వే నిర్వహించారు. ఈసర్వే అంశాల ఆధారంగా జాతీయ నూతన విద్యావిధానం (ఎన్ఈపీ)– 2020 లక్ష్యాలు చేరేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈసర్వే నిర్వహణలో పాఠశాల విద్యాశాఖ, స్టేట్ ప్రాజెక్ట్ అధికారులు, ఎన్సీఈఆర్టీఅండ్ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, జిల్లా విద్యా శిక్షణ సంస్థలు, ఇతర విద్యాసంస్థల అధికారులు, ఉపాధ్యాయులు భాగస్వాములయ్యారు. ప్రతీ నాలుగేళ్లకోసారి దేశవ్యాప్తంగా ఈ సర్వే జరుగుతుంది.

సర్వే నిర్వహించిన అంశాలు

- గ్రామీణ, పట్టణ ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో సామర్థ్యాలపై ఈ సర్వే నిర్వహించారు.
- భాషలకు సంబంధించి ఆంగ్లం, తెలుగు, ఉర్దూలో సబ్జెక్టులకు సంబంధించి గణితం, సాంఘిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు సంబంధించి సర్వే నిర్వహించారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు.
- ఈ సర్వే ఫలితాల్లో 4 అంశాలవారీగా స్థాయిలను నిర్ణయించారు. ఇందులో ఉద్భవ్, ఉన్నత, ఉదయ్, ఉదిత్‌గా పేర్కొన్నారు. ఉదిత్ అత్యధిక స్థాయిని తెలియజేస్తుంది.
- హనుమకొండ జిల్లాలో భాషలు, గణితం అంశాల్లో ఉదిత్‌స్థాయి పొందుతూ ప్రథమ స్థానంలో రాష్ట్రంలో నిలిచింది.
- 9వ తరగతి విద్యార్థులు జాతీయస్థాయి నాణ్యత సాధించడంలో పోటీపడ్డారు. భాష నాణ్యతలో జాతీయస్థాయితో సమానంగా, గణితం – సైన్సెస్‌లో ఒకశాతం తేడాతో, సోషల్‌లో రెండుశాతం తేడాతో పోటీ పడినట్లు తేల్చారు.



గుణాత్మక విద్యపై దృష్టి సారించడంతోనే..

రెండు, మూడు విద్యా సంవత్సరాల నుంచి హనుమకొండ జిల్లాలో విద్యార్థుల గుణాత్మక విద్యపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలను అమలు చేయడంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, ఉపాధ్యాయుల తరగతి గది బోధనను పరిశీలించడం, విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి, విద్యార్థి కేంద్రీకృత బోధన చేయడం ద్వారా వారిలో కనీస సామర్థ్యాలు పెంచడంతో ఈ లక్ష్యాలను చేరుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖ చేపట్టిన ప్రణాళిక, కార్యాచరణ సత్ఫలితాలను ఇచ్చిందని, డీఈఓ డి.వాసంతి, హసన్‌పర్తి ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. సబ్జెక్టు నిపుణులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, మండల విద్యాశాఖాధికారులు తమ స్థాయిలో కృషి చేయడం వల్ల ఈసర్వేలో విద్యార్థుల్లో సామర్థ్యాల పెరిగాయని పేర్కొన్నారు. ప్రాథమిక తరగతి నుంచి విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, వ్యాఖ్యానించడం, గణిత పరిజ్ఞానంపై ప్రత్యేక దృష్టి నిలపడం వల్ల సత్ఫలితాలు వచ్చినట్లు వారు చెప్పారు.

గత పాలకుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి

- కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హన్మకొండ చౌరస్తా: గత పాలకుల చేతగానితనం, నిర్లక్ష్యం కారణంగా కోట్లాది రూపాయల స్మార్ట్ సిటీ నిధులు వెనక్కి వెళ్లాయని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు విమర్శించారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో వెనక్కి మళ్లిన రూ.300ల కోట్ల స్మార్ట్ సిటీ నిధులను తిరిగి తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్న ఘనత ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక కార్పొరేటర్లు కాకుండా పక్క నియోజకవర్గ కార్పొరేటర్లతో మాజీ ఎమ్మెల్యే మాట్లాడించడం హాస్యాస్పదంగా ఉందని ఆరోపించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు విజయశ్రీ, జక్కుల రవీందర్, వేముల శ్రీనివాస్, ఏనుగుల మానస, మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్లు బోడ డిన్నా, తాడిశెట్టి విద్యాసాగర్, నాయకులు కుమార్‌యాదవ్, రహిమున్నీసా, మాడిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు సకాలంలో యూరియా



రైతులతో మాట్లాడుతున్న డీసీఓ సంజీవరెడ్డి

- డీసీఓ సంజీవరెడ్డి

హసన్‌పర్తి: యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని డీసీఓ సంజీవరెడ్డి భరోసా ఇచ్చారు. హసన్‌పర్తి మండలం వంగపహాడ్ పీఏసీఎస్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎలాంటి యూరియా కొరత లేదన్నారు. సొసైటీలకు సకాలంలో యూరియాను అందిస్తున్నట్లు చెప్పారు. అధికారుల సలహాలు పాటించి రైతులు యూరియాను వాడుకోవాలని సూచించారు. వంగపహాడ్ సొసైటీలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ (ఎఫ్‌పీఏ) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వంగపహాడ్ పీఏసీఎస్‌కు కేటాయించిన రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆయన సందర్శించారు. ఎఫ్‌పీఓ ద్వారా రుణం తీసుకుని గోదాం నిర్మించాలని, రుణాలు తీసుకుని చెల్లించని వారికి నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్ గౌడ్, వైస్ చైర్మన్ జూలూరి రాజుగౌడ్, డైరెక్టర్లు గణేష్, రవి, సిబ్బంది స్వామి, రమేష్, మహేష్, రాజయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో హనుమకొండలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో మత్తు పదార్థాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని అన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నంబర్ కాల్ చేయాలని సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కళా బృందం పాటలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్సై పశురాం, ఏఎస్సై లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

హిందీ పాఠ్యప్రణాళిక ఆవిష్కరణ

విద్యారణ్యపురి: ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు హిందీ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన హిందీ మాదిరి పాఠ్య ప్రణాళిక పుస్తకాన్ని హనుమకొండ జిల్లా డీఈఓ కార్యాలయంలో డీఈఓ వాసంతి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హసన్‌పర్తి ఎంఈఓ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, హిందీ స్టేట్ రిసోర్స్ పర్సన్ మాదరి పాఠ్య ప్రణాళిక సంపాదకుడు గౌస్‌పాషా, జిల్లా రిసోర్స్ పర్సన్ మహ్మద్ అజీమొద్దీన్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, హిందీ ప్రచార సభ పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ సుధాకర్, హిందీ పండితులు పాల్గొన్నారు.

నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి



మాట్లాడుతున్న మధుసూదన్

కాజీపేట అర్బన్: మా ఊర్లో కరెంట్ తీరే వేరు అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ఈనెల 8న ప్రచురితమైన కథనానికి ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ మధుసూదన్ స్పందించారు. కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలోని కడిపికొండ సబ్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. 11 కేవీ, ఎల్‌టీలైన్ల ఇంటరప్షన్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డీటీఆర్, లైన్ల నిర్వహణను వెంటనే చేపట్టాలని ఆయన ఆదేశించారు.

సఖి సెంటర్‌కు బాలిక అప్పగింత



బాలికను సఖి సెంటర్‌కు అప్పగిస్తున్న సీఐ

కాజీపేట రూరల్: బాలికను సఖి వన్ స్టాప్ సెంటర్‌కు కాజీపేట జీఆర్పీ పోలీసులు బుధవారం అప్పగించారు. కాజీపేట జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ వి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా సుమారు 17 ఏళ్ల చిదురాల అంజలి అనుమానాస్పదంగా ఒకటో ప్లాట్‌ఫాం నంబర్ వద్ద కూర్చొని ఉంది. ఆమెను వివరాలు అడగగా, తనకు తల్లిదండ్రులు ఎవరూ లేరని, కరీంనగర్ సదరం హోమ్‌లో ఉన్నానని చెప్పారు. కరీంనగర్ సదరం హోమ్ ఇన్‌చార్జ్ రమాదేవికి ఫోన్ చేసి వివరాలు అడగగా, ఆ బాలిక గతంలో సదరం హోమ్‌లో పెరిగిందని, 7 ఏళ్ల క్రితం దంపతులు వచ్చి దత్తత తీసుకొని వెళ్లారని చెప్పారు. వారి వివరాలను గురువారం తెలియజేస్తామని రమాదేవి అన్నారు. ఆ బాలికను సఖి వన్ స్టాప్ సెంటర్ హనుమకొండ అడ్మిన్ హేమావతికి అప్పగించినట్లు సీఐ వివరించారు.

ఆర్మీ క్యాంపునకు ఎల్‌బీ విద్యార్థులు



కేడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

రామన్నపేట: ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లోని మెహిదీపట్నం ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతంలో జరగనున్న ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపునకు నగరంలోని ఎల్‌బీ కళాశాల తెలంగాణ పదో బెటాలియన్ ఆర్మీ వింగ్‌కు చెందిన వెన్నెల, హాస్య బేగం, సాహిత్య ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆర్మీ భారత రక్షణ రంగంలో వాడే ఆయుధాల పనితీరు, వాటి ప్రాధాన్యత, శత్రు లక్ష్యాలు, మ్యాప్ రీడింగ్, టార్గెట్, ఫైరింగ్, ఆయుధాల తయారీపై కేడెట్లకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపునకు ఎంపికైన కేడెట్లను ప్రిన్సిపాల్‌తో పాటు చైర్మన్ భాగ్యనారాయణ, సెక్రటరీ వినయ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, కెప్టెన్ సదానందం, అధ్యాపకులు అభినందించారు.

నినదించిన కార్మిక లోకం

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను నగరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించి, కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన తెలిపారు. **– సాక్షి నెట్‌వర్క్**



వరంగల్ రంగశాయిపేట చౌరస్తాలో సమ్మెలో పాల్గొన్న కార్మికులు



హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



ఎంజీఎం ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఎంజీఎం కార్మికులు



సమ్మెలో భాగంగా నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు, కార్మికులు



హనుమకొండ పోస్టల్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు



కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట సమ్మెలో పాల్గొన్న సికింద్రాబాద్, కాజీపేట రైల్వే సంఘ్ నాయకులు



కేయూ పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఉద్యోగ సంఘాల నాయకులు



ర్యాలీ తీస్తున్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు

సంక్షిప్తంగా

సీఐ రమేష్‌ను కలిసిన పీఎంఎస్ సభ్యులు

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్‌ను శంభునిపేటకు చెందిన పీపుల్స్ మెడియేషన్ సెంటర్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఎంఎస్ పనితీరును ఇన్‌స్పెక్టర్‌కు సభ్యులు వివరించారు. ప్రజల మధ్య జరిగే వివాదాలు, కుటుంబ సమస్యలను ఎలాంటి ఫీజు లేకుండా, సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తున్నట్లు వివరించారు. అనంతరం, ఇన్‌స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ త్వరలో మెడియేషన్ సెంటర్‌కు సందర్శించి సేవా కార్యక్రమాలను పరిశీలిస్తానని అన్నారు. కార్యక్రమంలో మెడియేషన్ సెంటర్ సభ్యులు వడ్డనాల నరేందర్, ధర్మపురి రాజగోవిందు, సునీత, మార్గం ఎల్లయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి

హసన్‌పర్తి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాను ఎగరవేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలంలోని జయగిరి, పెంబర్తి, గంటూరుపల్లి గ్రామాల ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ మాజీ సభ్యుడు సంగాల విక్టర్ బాబు, ఆయా గ్రామాల ఇన్‌చార్జ్‌లు ఎల్లావుల కుమార్‌యాదవ్, మేకల భగవాన్‌రెడ్డి, శరత్, బొమ్మగాని వెంకటేష్, పెద్ది మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఖిలా వరంగల్: ప్రమాదవశాత్తు రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం ఉదయం వరంగల్ – కాజీపేట మధ్య హంటర్‌రోడ్డు సమీపంలోని ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. రైలులో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని 55 ఏళ్లకు పైబడిన వ్యక్తి హంటర్ రోడ్డు సమీపంలోని ట్రాక్ పక్కన ఉన్న చెట్లలో తీవ్ర గాయాలతో స్పృహ లేకుండా పడి ఉన్నాడన్న సమాచారంతో ఘటన స్థలానికి జీఆర్పీ కానిస్టేబుల్ విక్రమ్ చేరుకొని క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పట్టాభిరామ్‌కు ఘన నివాళి

హన్మకొండ కల్చరల్: ఇటీవల మృతి చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్ర జాలికుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ సంసర్మణ సభ మంగళవారం రాత్రి వరంగల్ గిర్మాజీపేటలోని ఉమ్మడి వరంగల్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పట్టాభిరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు, మెజీషియన్ శ్రీరామ్ కళ్యాణ్, కార్యదర్శులు వినయ్, లాజరస్, గౌరవాధ్యక్షుడు దశరథం, శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ సలహాదారులు మార్త రవి, ఆనంద్‌కుమార్, సభ్యులు భిక్షపతి, రాజశేఖర్, అశ్రిత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో అర్హులనే ఎంపిక చేయాలి

వరంగల్ అర్బన్: ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే కేటాయించాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు.

రూ.76 వేల గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

ఖిలా వరంగల్: అక్రమంగా నిల్వ చేసిన 76,350ల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ తోటకు చెందిన నిందితుడు బంగారు వేణుపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

మల్లికాంబ కేంద్రంలో అన్నదానం

హన్మకొండ అర్బన్: రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను నగరంలోని బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో బుధవారం నిర్వహించారు. సీతక్క ఉద్యమ సహచరులు కంకణాల విజయ – సంతోష్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అన్నదానం చేసి, పండ్లు అందజేశారు.

భద్రాచలం ఈఓపై దాడి హేయం

హన్మకొండ చౌరస్తా: భద్రాచలం ఆలయ ఈఓ లాలుకోట రమాదేవిపై భూ ఆక్రమణదారులు దాడి చేయడం హేయమైన చర్య అని, ఆ దాడిపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. దక్షిణ మిథిలా నగరంగా పేరుగాంచిన భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ భూముల పరిరక్షణకు తన ఉద్యోగ ధర్మంలో భాగంగా అల్లూరి జిల్లా పురుషోత్తమ పట్నంలో పరిశీలనకు వెళ్లిన ఈఓ రమాదేవిపై దాడిచేయడం దుర్మార్గమని అన్నారు.

ఈఓపై దాడిని ఖండించిన దేవాదాయ శాఖ సిబ్బంది

హన్మకొండ కల్చరల్: భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, సిబ్బందిపై జరిగిన దాడిని వరంగల్ జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు, సిబ్బంది ఖండించారు. ఈ మేరకు వరంగల్‌లోని ధార్మిక భవన్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శేషభారతి, జిల్లా అసిస్టెంట్ కమీషనర్ రామల సునీత, దేవాదాయ శాఖ ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ భావంతో ముందుకెళ్లాలి

విద్యారణ్యపురి: ఏబీవీపీ వ్యక్తిత్వ నిర్మాణం ద్వారానే జాతీయ పునర్‌నిర్మాణం అవుతుందని, ఈ క్రమంలో విద్యార్థులు జాతీయ భావంతో ముందుకెళ్లాలని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రవణ్ బిరాజ్ సూచించారు. ఏబీవీపీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో 77వ జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా కేయూ క్రాస్‌రోడ్డు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బుధవారం శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, జిల్లా కన్వీనర్ దూళిపూడి హరిచరణ్, వరంగల్ మహానగర్ కార్యదర్శి బెల్లం కార్తీక్, రోహిత్, యశ్వంత్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, త్రినేష్, ప్రవిజ్ఞాన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నిత్యం అండగా పోలీసులు

మడికొండ: ప్రజలకు ఎల్లప్పుడూ పోలీసులు అండగా ఉంటారని మడికొండ హెడ్ కానిస్టేబుల్ జయరాజు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మడికొండలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌కు సంబంధించిన పోస్టర్లను పలు కాలనీల్లో బుధవారం అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా వెంటనే పోస్టర్‌పై ఉన్న నంబర్‌కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని జయరాజు సూచించారు.